క్లుప్తంగా

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): మహా శివరాత్రిని పురస్కరించుకొని మార్కండేశ్వర స్వామి ఆలయంలో జరిగే ఉత్సవాల ఏర్పాట్లను కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిమెంట్ రోడ్డులో అడ్డంగా ఉన్న ఇనుప స్తంభాలను మార్చి కొత్త స్తంభాలను ఏర్పాటు చేయించారు. అలాగే ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీకి సూఇచంచారు. ఆలయ కమిటీ చైర్మన్ గొంట్ల మల్లికార్జున్‌రావు, విజేత కళాశాల కరస్పాండెంట్ కౌన్సిల్ దాసరిమురళి, బేరి భాస్కర రెడ్డి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రమశిక్షణ ముఖ్యం



సరస్వతీ పూజలో పాల్గొన్న పాఠశాల సిబ్బంది, విద్యార్థులు

కొండపి: విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ ముఖ్యమని ఎంఈఓ-2 రామారావు అన్నారు. స్థానిక కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సరస్వతి పూజ, 10వ తరగతి విద్యార్థుల విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులు పరీక్షలు అనే భయాన్ని పోగొట్టుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రధానోపాధ్యాయుడు సూసన్నకుమార్, విద్యా కమిటీ మాజీ చైర్మన్ రాఘవేంద్ర శర్మ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో సత్తా



జయలక్ష్మిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

కనిగిరి రూరల్ (హనుమంతునిపాడు): ఆంధ్రకేసరి యూనివర్శిటీ విడుదల చేసిన మూడో సంవత్సరం డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో వైష్ణవి డిగ్రీ కళాశాల విద్యార్థిని మితుకుల్ల జయలక్ష్మి యూనివర్శిటీ ఫస్ట్ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని కళాశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో కరస్పాండెంట్ రామన విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ నారబోయిన వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉలవపాడు: మండల పరిధిలోని వీరేపల్లిలోని మోడల్‌స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 5వ తరగతి చదువుతూ 1-9-2013 నుంచి 31-8-2015 మధ్య పుట్టిన వారై ఉండాలి. 24-2-2025 నుంచి 31-3-2025 లోపు ఆన్‌లైన్ ద్వారా పరీక్ష ఫీజు చెల్లించాలి. ఈసమయంలో వారికి కేటాయించిన నంబర్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఓసీ, బీసీలకు రూ.150, ఎస్సీ, ఎస్టీలకు రూ.75 చెల్లించాలన్నారు. 20-04-2025న ప్రవేశ పరీక్ష మోడల్ స్కూల్ ఆవరణలో జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కనిగిరిరూరల్(హనుమంతునిపాడు): ఏపీ మోడల్ స్కూలులో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తులసి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసి ఆరో తరగతిలో చేరేందుకు ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.75 రుసుం చెల్లించాలన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చని పేర్కొన్నారు. ఏప్రిల్ 20న పరీక్ష, అదే రోజు ఫలితాలు ప్రకటిస్తామన్నారు. ఏప్రిల్ 27న మెరిట్ లిస్టు ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. ఏప్రిల్ 30న సర్టిఫికెట్ల పరిశీలన చేస్తామన్నారు. అనంతరం జూన్ విద్యా సంవత్సరం ప్రారంభంలో ఆరో తరగతి విద్యార్థులకు ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు.

మన్నేటికోట.. నీటికి కటకట

- ఆరు రోజులుగా నిలిచిన నీటి సరఫరా
- గ్రామస్తుల ఇబ్బందులు



గుంతల ఏర్పాటు వలన పగిలిన పైపు లైను



పైపులైను పగిలి నిలిచి ఉన్న నీరు

ఉలవపాడు:

వేసవి రాకముందే ప్రజలు తాగునీటికి అల్లాడుతున్నారు. మన్నేటికోట గ్రామం నీటికి కటకటలాడుతోంది. మన్నేరు పక్కనే నిరంతరం నీటి సరఫరా జరగాల్సిన ఈ గ్రామం అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీటి ఇబ్బందులు ఎదుర్కొంటుంది. మన్నేటికోట గ్రామ పంచాయితీ పరిధిలోని దక్షిణ మన్నేటికోట, శంకర్‌నగర్ కాలనీ, తిరుపతి గుంట గిరిజన కాలనీలలో ప్రజలు నీటి కోసం నానా పాట్లు పడుతున్నారు. పైపు లైను లీకేజీల కారణంగా నీటి సరఫరా నిలిచిపోయింది. ఇటీవల విద్యుత్ శాఖ సిబ్బంది స్తంభాల ఏర్పాటు కోసం కొన్ని గుంతలు తీశారు. పైపు లైను మీద కూడా గుంతలు తీయడంతో లైను దెబ్బతినిందని స్థానికులు తెలిపారు. పైపు లైను వద్ద పనులు చేసే సమయంలో రెండు శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది దగ్గరుండి పనులు చేయించుకోవాలి. ఎలాంటి నష్టం జరగకుండా చూడాలి. కాని అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆరు రోజుల నుంచి మంచి నీరు లేని పరిస్థితి నెలకొంది. తిరుపతి గుంట గిరిజన కాలనీకి అయితే గత పదిరోజులుగా కుళాయిల ద్వారా నీటి సరఫరా జరగలేదు. వేసవి కాలం ప్రారంభం కాకముందే పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే ఎలా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

బాగు చేయండి సార్..

పైపు లైనును బాగు చేసి నీటి సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ గ్రామానికి మన్నేరులో శివాలయం పక్కన బోరు ఏర్పాటు చేసి అక్కడ నుంచి మోటార్ ద్వారా ట్యాంకుకు పంపిస్తారు. అక్కడ నుండి శంకర్ నగర్ కాలనీ, దక్షిణ మన్నేటికోట, తిరుపతి గుంట వరకు పైపు లైను ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. ఆదిలోనే శివాలయం వద్ద నుంచి దక్షిణ మన్నేటికోట లోపే పైపు లైన్లు పగిలి నీరు బయటకు వచ్చేస్తుండడంతో కుళాయిల ద్వారా నీటిసరఫరా నిలిచిపోయింది. గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయించి గ్రామప్రజలకు నీటి సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ, చైర్మన్, సీఐ

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ పేర్కొన్నారు. నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం మహాశివరాత్రి ఉత్సవాలపై సమీక్షా సమావేశం, పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ, చైర్మన్ మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలకు ఈ విడత సుమారు 25 వేల పైచిలుకు భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, ఆ మేరకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, అన్నప్రసాదం, వాహన పార్కింగ్ వసతులు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మహాశివరాత్రి నాడు రాత్రి 10 గంటల నుంచి గండదీపం భక్తులకు దర్శనంకోసం అవకాశం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని, భక్తులు ఇందుకు సహకరించాలన్నారు. సీఐ భీమానాయక్ మాట్లాడుతూ ముఖ్యంగా వాహనదారులు ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా వాహనాలను నిలుపుకోవాలన్నారు. ప్రత్యేక పోలీస్ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ వారు ప్రత్యేక బస్‌లు నడుపుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై ఆర్.సుమన్, కొమ్మినేని వెంకట్రావు, ఆర్టీసీ డీయం మహ్మద్ సయనాబేగం, డాక్టర్ విజయ్‌కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రికి 40 బస్సు సర్వీసులు



భైరవకోనలో పార్కింగ్ స్థలాలు పరిశీలిస్తున్న సీఐ, ఆర్టీసీ డీఎం



లింగసముద్రంలో మాట్లాడుతున్న డిపో సహాయ మేనేజర్ శ్యాంప్రసాద్

సీఎస్‌పురం(పామూరు): మహాశివరాత్రిని పురస్కరించుకొని కనిగిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలైన భైరవకోన, మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయం, శ్రీశైలం, పునుగోడు పుణ్యక్షేత్రాలకు మొత్తం 40 ప్రత్యేక బస్‌సర్వీసులు ఏర్పాటుచేస్తున్నట్లు కనిగిరి ఆర్టీసీ డీఎం మహ్మద్ సయనాబేగం తెలిపారు. ఈసందర్భంగా శనివారం భైరవకోన, మిట్టపాలెం నారాయణస్వామి ఆలయ సమీపంలో బస్ పార్కింగ్ ప్రదేశాలను ఆమె పామూరు సీఐ ఎం భీమానాయక్‌తో కలిసి పరిశీలించారు. డీఎం మాట్లాడుతూ ప్రత్యేక బస్సు సరీ్వసుల్లో పాత ఛార్జీలే ఉంటాయని, ఎలాంటి అదనపు చార్జీలు ఉండవన్నారు. భక్తులు ఆటోల్లో ప్రయాణం చేయకుండా ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలన్నారు. సీఐ భీమానాయక్ మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రయాణం ఎంతో క్షేమకరమన్నారు. భైరవకోనలో ఆర్టీసీ బస్టాఫ్ నుంచి జలపాతం, త్రిముఖ దుర్గా ఆలయంవరకు భక్తులను తరలించేందుకు ఉచితంగా తుఫాన్ వాహనాలు, వ్యాన్‌లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా మద్యంసేవించి వాహనాలు నడిపినా, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా వచ్చినా, ట్రాఫిక్ అంతరాయం కలిగించేలా వాహనాలను నిలిపినా జరిమానా విధిస్తామన్నారు. ఎస్సై ఆర్.సుమన్, ఆలయసిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రికి మొగిలిచర్లకు 30 ప్రత్యేక బస్సులు

లింగసముద్రం: మహాశివరాత్రి పండుగ సందర్భంగా ఈనెల 26న లింగసముద్రం మీదుగా మొగిలిచర్ల దత్తాత్రేయస్వామి మందిరం వద్దకు కందుకూరు డిపో నుంచి 30 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో సహాయ మేనేజర్ శ్యాంప్రసాద్ శనివారం చెప్పారు. మహాశివరాత్రి రోజున లింగసముద్రంలోని తిరుమణిశెట్టి కోటయ్య మందిరం, మొగిలిచర్ల దత్తాత్రేయస్వామి మందిరం సమీపంలో ఆర్టీసీ బస్సులు నిలుపు స్థలాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. దత్తాత్రేయ స్వామి మందిరం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్, కోటయ్య మందిరం నిర్వాహకులు తిరపతయ్యలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ మాట్లాడుతూ కందుకూరు నుంచి లింగసముద్రం మీదుగా మొగిలిచర్లకు 25 బస్సులు, మాలకొండ మీదుగా మొగిలిచర్లకు 5 బస్సులు నడపనున్నట్లు చెప్పారు. అలాగే మహాశివరాత్రి రోజున కావలి నుంచి కూడా లింగసముద్రం, మొగిలిచర్లకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు కావలి డిపో మేనేజర్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మహాసుదర్శన హోమం



ఆలయంలో పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా మండలంలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో 3వ రోజు శనివారం రుత్వికులు మంకాల శివప్రసాద్‌శర్మ, పప్పు శ్రీకాంత్‌శర్మల ఆధ్వర్యంలో నవగ్రహ మహాసుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి మూల విగ్రహమూర్తికి, ఉత్సవమూర్తికి అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం రాత్రికి నారాయణస్వామి ఉత్సవమూర్తికి పల్లకి సేవ నిర్వహించారు. అదేవిధంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమహావిష్ణుమూర్తి, నారాయణస్వామి ఉత్సవమూర్తులకు మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. పూజల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు కదిరి పార్థసారది, మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.బుజ్జి, నాయకులు పాల్గొన్ని పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈవో జి.నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, ముడుమాల నారాయణరెడ్డి, ఉపసర్పంచ్ టి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



మిట్టపాలెంలో గజవాహన రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ముగ్గురు జూదరుల అరెస్టు

కనిగిరి రూరల్ (హనుమంతునిపాడు): మండల పరిధిలో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై మాధవరావు తెలిపారు. మండలంలోని మాచవరం పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.2,420 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కనిగిరి రూరల్ (హనుమంతునిపాడు): పట్టణంలో విద్యుత్ టవర్ల మరమ్మతుల నేపథ్యంలో టౌన్-1 ఫీడర్ పరిధిలో ఆదివారంపూర్తిగా సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేట ఎంఎస్ఆర్ రోడ్డు, వైఎస్ఆర్ రోడ్డు, తదితర ప్రాంతాలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

మర్రిపూడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం అమృతకంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ వరికూటి భరత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి తక్కువ ఖర్చుతో శుక్లాల ఆపరేషన్ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గురుకుల పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రామాంజి యాదవ్

టంగుటూరు: టంగుటూరు బాలుర బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో వెట్టిచాకిరీ చేయిస్తున్న ప్రిన్సిపాల్, ఇతర సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రామాంజి యాదవ్ డిమాండ్ చేశారు. ఒంగోలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని శనివారం పరామర్శించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. గురుకుల పాఠశాలలో వంట మనుషులు చేయాల్సిన పనులను మధు అనే ఐదో తరగతి విద్యార్థితో చేయించడంతో పాల గిన్నె జారి ఆ విద్యార్థిపై పడి తీవ్ర గాయాలయ్యాయి. ఇలాంటి సంఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

పూల తోట కాదు.. పొగాకు తోట



తెల్లటి పూలతో ఆకుపచ్చని ఆకులతో కనువిందు చేస్తున్నది పూల తోట అనుకుంటే మీరు పొరబడినట్లే... ఇది పొగాకు తోట..మండలంలోని టంగుటూరు, జమ్ములపాలెం గ్రామాల్లో సాగు చేసిన పొగాకు తోటలు పూలతో నిండి రోడ్డుపై నుంచి చూస్తే పూల తోటలను తలపిస్తున్నాయి.

– టంగుటూరు:

తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి

మర్రిపూడి: వేసవిని దృష్టిలో ఉంచుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు వేసవిని తలపిస్తున్నాయని, ఈతరుణంలో తాగునీరు ప్రతి గ్రామానికి అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తాగునీటి ట్యాంకులన్నింటినీ క్లోరినేషన్ చేయించి ప్రజలకు శుద్ధ జలాలు అందించేలా చూడాలన్నారు. అవసరమైతే ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. ఆర్‌డబ్ల్యూస్ ఏఈ జైపాల్ మాట్లాడుతూ మండలంలో చిమట, మర్రిపూడి, గుండ్లసముద్రం గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు శిథిలావస్థకు చేరాయని, వాటిని కూల్చేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. ధర్మవరంలో డీప్‌బోరు మరమ్మతులకు గురవడంతో నెల రోజులుగా తాగునీరు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ గంగిరెడ్డి రమణారెడ్డి సమావేశం దృష్టికి తీసకువచ్చారు. కూచిపూడి గ్రామంలో రూ.16 లక్షలతో చేసిన జేజేఎం పనులు నాసికరంగా చేయడంతో కుళాయిలు సైతం ఊడిపోయాయని సర్పంచ్ మాచేపల్లి చిన కోటమ్మ హనుమంతరావు సమావేశ, దృష్టికి తీసుకువచ్చారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మెమోలు ఇస్తామని ఎంపీడీఓ జగదీష్ తెలిపారు. అధికారులు ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా పనిచేసి మండలాన్ని అభివృద్ధి బాటలో నడపాలని సూచించారు. వైద్యాధికారి సాయి రుచిత, వ్యవసాయాధికారి వెంకటేష్, విద్యుత్ ఏఈ సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కందుకూరు: పంటలకు గిట్టుబాటు ధర కోసం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రజాసంఘాలు శనివారం ధర్నా నిర్వహించారు. రైతు సంఘం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కలిపంచాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఆందోళనలో భాగంగా ఈ ధర్నా నిర్వహించినట్లు సంఘాల నాయకులు తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు ఎస్ఏ.గౌస్, జేబీవీ కుమార్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మాదాల రమణయ్యలు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జస్టిస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను పక్కనపెట్టి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. పెట్టుబడులు అధికమై గిట్టుబాటు ధర రాక అప్పులుపాలై ఆత్మహత్యలు పాల్పడుతున్నారన్నారు. కందుకూరు నియోజకవర్గంలో ప్రధానంగా వరి, పొగాకు, మిర్చి, శనగ పంటలు వేశారని అధిక పెట్టుబడలతో ఎంతో శ్రమకోర్చి రైతులు పండించినప్పటికి గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా దివాలా తీసే పరిస్థితి ఏర్పడిందన్నారు. పొగాకు పంటకు క్వింటాకు సగటు ధర రూ.35 వేలు ఇవ్వాలని, మిర్చి క్వింటాకు రూ.25 వేలు ఇవ్వాలని, వరి ధాన్యానికి క్వింటాకు రూ.4500లు ఇవ్వాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ గుడ్లూరు, ఉలవపాడు మండల కార్యదర్శి కె.వెంకయ్య, ఎస్‌డీ.గౌస్‌బాషా, రైతు సంఘం గుడ్లూరు మండలం అధ్యక్ష, కార్యదర్శులు దామా కృష్ణయ్య, వర్ధినేని సిద్ధయ్య, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతితో బోధనలో మెళకువలు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున ఎంఈఓ సుబ్బారావు



జరుగుమల్లిలో అంగన్‌వాడీలకు అవగాహన కల్పిస్తున్న విద్యాశాఖ అధికారులు

పామూరు: అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ ఎంతో ఉపకరించిందని, దీని ద్వారా బోధనలో మెళకువలు తెలుసుకున్నారని ఎంఈఓ డీవీ సుబ్బారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో శనివారం సమగ్రశిక్ష, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజులుగా జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణలో ఆయన మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. ఆటపాటల ద్వారా ఒత్తిడి లేకుండా అభ్యసనం చేయించడమే ఈ శిక్షణ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఎం రామస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోల్ల పద్మజ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: జ్ఞానజ్యోతి శిక్షణ ఎంతో ఉపయోగకరమని ఎంఈఓ ఎస్ రమణయ్య అన్నారు. నాల్గవ రోజు శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ గౌస్‌నీసాబేగం, కాంప్లెక్స్ చైర్మన్ బొప్పరాజు సుబ్బారావు, ఆర్పీలు పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): జ్ఞానజ్యోతిలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు నాల్గవ రోజు శిక్షణ ఇచ్చారు. అనంతరం శిక్షణలో ప్రతిభ కనబరుస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎంఈఓ శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అంగన్వాడీ సూపర్‌వైర్లు, రిసోర్స్ పర్సన్లు ఎం. నాగేశ్వరరావు పి.బ్రహ్మయ్య, పి.వెంకటేశ్వర్లు, పి.భారతి, ఎల్.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవరావు సేవలు ప్రశంసనీయం



చెన్నకేశవులను సన్మానిస్తున్న అధ్యాపకులు

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): కనిగిరి జూనియర్ కళాశాలో 33 ఏళ్లుగా అధ్యాపకునిగా పని చేస్తూన్న చెక్కా చెన్నకేశవరావు సేవలు ప్రశంసనీయమని ప్రిన్సిపాల్ రమణారెడ్డి, పలువురు అధ్యాపకులు కొనియాడారు. చెన్నకేశవరావు ఉద్యోగ విరమణ కార్యక్రమం శనివారం ప్రిన్సిపాల్ అధ్యక్షతన నిర్వహించారు. పొన్నలూరు ప్రిన్సిపాల్ రాజేంద్ర బాబు, పీసీపల్లి ప్రిన్సిపాల్ విజయ శంకర్, కదిరి నాగేశ్వరరావు, పి.వెంకటేశ్వర్లు, డిగ్రీ కళాశాల దాత తంగుటూరి గోవిందరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

జరుగుమల్లి(సింగరాయకొండ): పీఎం కిసాన్ నిధుల విడుదలకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి వ్యవసాయాధికారి డి.యుగంధర్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ వేగంగా చేస్తున్నారని, రైతులంతా సహకరించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 24న పీఎం కిసాన్ నిధులు విడుదలవుతాయని తెలిపారు.